క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి వైభవంగా పూజలు


ప్రత్యేకాలంకరణలో వీర అభయాంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అత్యంత వైభవంగా పూజలను నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించింది. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకు పూజ, అష్టోత్తర పూజలు చేశారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణానికి చెందిన రెడ్డిజన సేవా సంఘం యువకులు హనుమాన్ చాలీసాను ఆలపించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో దేవస్థాన ప్రాంగణాన్ని అలంకరించారు. ఆంజనేయస్వామి ఎల్‌ఈడీ బొమ్మలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాటలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, మహిళల కోలాటం నడుమ అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు చెందిన కళాకారులు బృందావనం, కాంతార నృత్యాలతో అలరించారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు


కొడవలూరు: రామన్నపాళెంలో..

ఇందుకూరుపేట: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సబ్సిడీపై పరికరాలను రైతులకు అందజేయనున్నామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల నివేదికలను గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని వివరించారు. తమ పేర్లను సరిచూసుకోవాలని సూచించారు. ఏడీఏ నర్సోజీరావు, ఏడీఏ సుమలత, ఎంఏఓ రఘునాథ్‌రెడ్డి, జగదేవిపేట వెటర్నరీ డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: వరిసాగులో యాజమాన్య పద్ధతులు ప్రధానమని ఏఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. ఆకు నల్లిని నివారించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతులు ఈ – కేవైసీని విధిగా చేయించుకోవాలని సూచించారు. జేవీఓ అరుణజ్యోతి, ఏఈఓ వెంకట్రావు, వీఆర్వో రమేష్, వీఏఏలు పృథ్వి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంపై సమీక్ష


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు మంగళవారం జరిపారు. ఎంపీడీఓ నారాయణరెడ్డి, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

పొదలకూరు: త్వరలో నెల్లూరు రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్టు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పొదలకూరు బస్టాండ్‌ను 15 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చినట్టు చెప్పారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల రిపేర్లు, పెయింటింగ్స్ తదితర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. స్థానికులు సురేష్‌రెడ్డిని కలిసి పొదలకూరు నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని, తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల్లోగా జిల్లా కేంద్రం నెల్లూరుకు బస్సుల్లేవని, సర్వీసులను నడపాలని విజ్ఞప్తి చేశారు.

కష్టపడే వారికి అధిక ప్రాధాన్యం

• ఆనం విజయకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే వారికి అధిక ప్రాధాన్యమివ్వనున్నామని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో పార్టీ 38వ డివిజన్ నేతలు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూరల్‌లోని పార్టీ నేతలు, కార్యకర్తలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పార్టీ శ్రేణుల సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వారికి ప్రాధాన్యమిస్తామని వివరించారు. పదవులు పొంది షో చేసే వారు పార్టీకి అవసరం లేదని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ డివిజన్ ఇన్‌చార్జిగా అబ్దుల్ హలీమ్‌ను నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, నేతలు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, అబ్దుల్ రజాక్, శారద, ప్రవీణ్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బృందావనం): నగరంలోని 45వ డివిజన్లో పారిశుధ్య పనులను ఎంహెచ్ఓ చైతన్య మంగళవారం పరిశీలించారు. కార్మికుల హాజరును స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో తీసుకున్నారు. గాంధీబొమ్మ వద్ద సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడి పారిశుధ్య పనులను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు.

ఎలక్ట్రికల్ విభాగాధిపతి బాధ్యతల స్వీకరణ


అభినందనలు తెలియజేస్తున్న సహచరులు

నెల్లూరు (టౌన్): గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి నెల్లూరు పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీ అయిన భవానీశంకర్ ఎలక్ట్రికల్ విభాగాధిపతిగా బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు అభినందనలను తెలియజేశారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 18 మంది ఎంపిక



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ మాట్లాడారు. ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులు హాజరుకాగా, 18 మంది ఎంపికయ్యారని వివరించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ సేతు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను మంగళవారం నిర్వహించారు. పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం తదితర పూజా కార్యక్రమాలను భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు వేదాంత శ్రీమాన్ కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఉషా, డాక్టర్ నరసింహారెడ్డి, విజయ, శ్రీనివాస్, రాధ, శింగంపల్లి నిఖిలేష్‌కుమార్, దివ్యభవాని దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, జగన్నాథం, శంకరన్ తదితరులు పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో యోగాంధ్ర



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. యోగాతో ఒత్తిడి దూరమవుతుందని చెప్పారు. దేవస్థానంలో యోగాపై శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు నిర్వహించనున్నామని వివరించారు.

కేంద్ర జలవనరుల శాఖ బృంద సభ్యుల పర్యటన



నెల్లూరు(బృందావనం): నీటి యాజమాన్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ పనితీరును పరిశీలించేందుకు గానూ కేంద్ర జలవనరుల శాఖ బృంద సభ్యులు కొల్లి రాంబాబు, ప్రదీప్‌కుమార్ మంగళవారం పర్యటించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు తదితరాలను పరిశీలించారు. భూగర్భ జలాల పెంపునకు నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలను అభినందించారు. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలించాక కేంద్రానికి నివేదిక పంపి, అవార్డు కోసం సిఫార్సు చేయనున్నామని వివరించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగ డీఈ ప్రసాద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశాన్ని గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

మేయర్‌ను కలిసిన ఏడీ

నెల్లూరు(బృందావనం): మేయర్ స్రవంతిని కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహరావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రణాళికలపై చర్చించారు.

వేణుగోపాలస్వామి దేవస్థాన పునర్నిర్మాణం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థాన పునర్నిర్మాణంలో భాగంగా పంచనామాను మంగళవారం నిర్వహించారు. ప్రధాన ఆలయ విమాన గోపుర కలశాలు, గాలిగోపుర కలశాలు తదితరాల తొలగింపును చేపట్టారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

నెల్లూరు(బృందావనం): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ ఏదైనా డిగ్రీ చదివిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఆధార్ జిరాక్స్, బయోడేటాను తీసుకురావాలని, వివరాలకు 86398 67407, 80746 34065 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అధిక ఫీజులను అరికట్టాలి

నెల్లూరు రూరల్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులను ప్రైవేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్నాయని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆరోపించారు. నగరంలోని జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. వీటిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కారు అద్దాల ధ్వంసం

నెల్లూరు సిటీ: కారును వెంబడించి.. అద్దాలను ఇద్దరు ద్విచక్రవాహనదారులు ధ్వంసం చేశారంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నేలటూరుకు చెందిన అరుణ్‌కుమార్ తన భార్య ఆరోగ్యం బాగోలేకపోవడంతో నెల్లూరులోని హాస్పిటల్‌కు సోమవారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో ధనలక్ష్మీపురం వద్ద కారును నెల్లూరుకు చెందిన నితీష్, వర్ధన్ ఆపి వాగ్వాదానికి దిగి, ఆపై అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు శిక్షణ


యోగా చేస్తున్న విద్యార్థులు

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అమూల్య మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరామయ్య, మల్లికార్జున, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం


అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ కోరారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని పడారుపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో అవగాహన ర్యాలీని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులతో కలిసి మంగళవారం నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. చలి, జ్వరమొస్తే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం పోలేరమ్మ చెట్టు వీధి ప్రాంతంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్యను నగరంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు.

సదారావుకు ఘన సన్మానం


నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు.

నెల్లూరు రూరల్: జిల్లాలో ఐ అండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సదారావును నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు, కోశాధికారి హనోక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• డీడీ సదారావుకు సిబ్బంది వీడ్కోలు పలికారు. నగరంలోని ఐ అండ్ పీఆర్ డీడీ కార్యాలయంలో

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని జీజీహెచ్‌లో గల సత్యసాయి సేవా ట్రస్ట్‌లో రోగుల సహాయకులకు అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నల్లారి సుబ్బారావు, రామకృష్ణ తల్లి శ్రీలక్ష్మి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, సభ్యులు స్వర్ణా రమేష్‌బాబు, సుబ్బరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలను శుభ్రంగా ఉంచండి


సూచనలు చేస్తున్న నందన్

నెల్లూరు(బృందావనం): నగరంలోని అన్ని డివిజన్లలో గల కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా జరిపి.. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 23వ డివిజన్లోని పడారుపల్లి తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. దోమల నివారణకు గానూ ఫాగింగ్.. కాలువల్లో మందును పిచికారీ చేయాలని ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాలువలను ఆక్రమించి చేపట్టిన ర్యాంపులు, మెట్ల నిర్మాణాలను తొలగించాలని చెప్పారు. డివిజన్ పరిధిలోని కొన్ని భవనాలకు కొలతలేయించి.. అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. డివిజన్లోని అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని పేర్కొన్నారు.

• ఎన్నికల సంఘం సూచనల మేరకు నెల్లూరు నగర నియోజకవర్గంలో అర్హులందరికీ ఓటు నమోదుపై అవగాహన కల్పించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నందన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షించాలని కోరారు. అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీమాలిక్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డీటీ ఆనంద్‌రావు, నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మావతి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అంకయ్యకు విజయకుమార్‌రెడ్డి పరామర్శ



నెల్లూరు సిటీ: ఇటీవల గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 28వ డివిజన్ ప్రధాన కార్యదర్శి అంకయ్యను నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, నేతలు చంద్రమౌళి, మల్లి, చంద్ర, రామిరెడ్డి, శేషు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): బైక్ విషయమై మాట్లాడాలని పిలిచి వ్యక్తిపై సమీప బంధువు కత్తితో దాడి చేసిన ఘటన బాలాజీనగర్‌లోని మసీదు సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మసీదు సెంటర్‌లో నివాసం ఉంటున్న షాకీర్, షాబీబ్ బంధువులు. పాత బైక్‌ల క్రయ, విక్రయాలను షాకీర్ చేస్తుంటారు. ఈ క్రమంలో బైక్ కొనుగోలు విషయమై మాట్లాడేందుకు గానూ మసీదు సెంటర్‌కు రావాలని షాకీర్‌ను కోరారు. అక్కడికెళ్లిన షాకీర్‌పై కత్తితో దాడి చేశారు. గమనించిన స్థానికులు అక్కడికి రావడంతో నిందితుడు పరారయ్యారు. గాయపడిన షాకీర్‌ను చికిత్స నిమిత్తం అపోలో హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు.. హాస్పిటల్‌కు చేరుకొని బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా ఘటనకు దారితీసిన పరిస్థితులు తెలియాల్సి ఉంది.

నేత్రదానం


నాగేశ్వరరావు (ఫైల్)

నెల్లూరు(అర్బన్): కావలిలోని కొత్తబజార్‌కు చెందిన వోలేటి నాగేశ్వరరావు (63) అనారోగ్యంతో నెల్లూరులోని ఎనెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ క్రమంలో మృతుడి నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు శ్రీవాణి, వాసవీ వనితా లెజెండ్ అధ్యక్షురాలు దుగ్గిశెట్టి హేమలత సహకారంతో జిల్లా ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 94946 08060 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.